క్లుప్తంగా

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

మాచర్ల రూరల్: స్థానిక కొత్తపల్లి గ్రామంలో అల్లం రామిరెడ్డి ఫౌండేషన్ నేతృత్వంలో ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు, ప్యాడ్‌లను పంపిణీ చేశారు. రామిరెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని శనివారం ఎంపీపీ, ఆర్‌సీఎం పాఠశాలల్లోని విద్యార్థులకు ఏటా వస్తువులను ఉచితంగా అందిస్తున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు అల్లం కోటిరెడ్డి తెలిపారు. అల్లం రామ్మోహన్‌రెడ్డి, శ్రావణి, రమ్య, రాంబాబు, హెచ్ఎం పిచ్చయ్య, ఉపాధ్యాయులు ఆదిలక్ష్మి, విజయకుమారి, మల్లిక, భారతి, నాసరమ్మ పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడి మృతి



సత్తెనపల్లి: కందువారిపాలెం గ్రామ సీపీఎం సీనియర్ నాయకుడు బగ్గి వెంకటేశ్వర్లు(65) శనివారం పాము కాటుకు గురై మృతి చెందాడు. గ్రామంలో జమ్ము కోసేందుకు వెళ్లిన ఆయనను పాము కాటు వేసింది. వైద్యశాలకు తీసుకురావడం ఆలస్యం కావడంతో మృతి చెందారు. మృతుడికి భార్య నాగేశ్వరమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వెంకటేశ్వర్లు మృతి చెందడంతో కందులవారిపాలెం సీపీఎం శాఖ ప్రగాఢ సానుభూతి తెలిపింది.

ఘనంగా చీమలమర్రి తిరునాళ్ల



నకరికల్లు: మండలంలోని చీమలమర్రి గ్రామంలో ఉన్న ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ 34వ వార్షికోత్సవం పురస్కరించుకొని విశేషపూజలు చేశారు. అర్చకులు నారాయణం వెంకట నరసింహాచార్యులు, అజయ్‌స్కంద, శేషుబాబు, రామ్‌కిరణ్, రామకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో విశేష ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. పండ్లు, వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అరటిపండ్ల గెలలతో ఆలయాన్ని అలంకరించడం స్వామివారి వైభవాన్ని చాటింది. స్వామివారి ఏకాహం నిర్వహించారు. భక్త సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. భక్తులు స్వామిని దర్శించుకొని, మొక్కులు చెల్లించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన పట్టణంలోని వెంకటపతి నగర్ వద్ద శనివారం జరిగింది. ట్రాక్టర్‌ను తప్పించబోయి కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పట్టణంలోని 23వ వార్డుకు చెందిన బాలకోటయ్య, రబ్బానీలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పుష్కలంగా ఉద్యోగ అవకాశాలు

సత్తెనపల్లి: పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు పాలిటెక్నిక్, బీటెక్, బ్యాంకింగ్, ఎయిర్ ఫోర్స్, ఆర్మీ రంగాల్లో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు సంపాదించుకోవచ్చునని మాస్టర్ ఆఫ్ మార్కెటింగ్ మేనేజ్‌మెంట్ టీఆర్ రమేష్ పేర్కొన్నారు. పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల భవిష్యత్తు మార్గదర్శకత్వం కోసం ఆర్యవైశ్య సేవా దళ్ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల లో శనివారం నిర్వహించిన కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. పదవ తరగతి అనంతరం ఉన్నత విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలను వివరించారు. సీఎస్ఆర్ కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు చిమటా నాగేశ్వరావు, పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు మద్ది వెంకటేశ్వరరావు, ఆర్య వైశ్య సేవాదళ్ అధ్యక్షుడు చలువాది హరికుమార్, సేవాదళ్ కార్యదర్శి పెరుమాళ్ల మణికుమార్, కాకర్ల సాయికుమార్, కమలాకర్ పాల్గొన్నారు.

క్రీడల్లో సెయింటాన్స్ విద్యార్థుల ప్రతిభ

మాచర్ల: పట్టణంలో సాగర్ రోడ్డులోని సెయింటాన్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో ఈ నెల 1 నుంచి 4వ తేదీ వరకు జరిగిన 36వ జాతీయ స్థాయి ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఆంధ్రప్రదేశ్ నుంచి జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీల్లో కార్తీక్, బోపేంద్ర, వై.పార్థసారథి గోల్డ్ మెడల్ సాధించారని ప్రిన్సిపల్ రెవ. సిస్టర్ రాయల్ మేరి తెలిపారు. శనివారం ముగ్గురు విద్యార్థులను సత్కరించి, మెమెంటోలు అందించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.కుమార్, ప్రతాప్, ఉపాధ్యాయులు సంతోష్, వినేష్, వెంకట్, రత్న, ప్రకాష్, ప్రసాద్, నాగేశ్వరరావు, ప్రేమ్, మధు రవాణి ఉన్నారు.

చంద్రబాబుకు మరోసారి గుణపాఠం తప్పదు

బుల్లెట్‌పై మంత్రి రాంబాబు పర్యటన



నకరికల్లులో బైక్ ర్యాలీలో పాల్గొన్న మంత్రి అంబటి

నకరికల్లు: మాట తప్పడమే తన నైజంగా మలుచుకున్న చంద్రబాబుకు మరోసారి ప్రజలు గుణపాఠం చెప్పేరోజు ఆసన్నమైందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని నకరికల్లు నుంచి చల్లగుండ్ల, చీమలమర్రి గ్రామాల మీదుగా కండ్లకుంట వరకు శనివారం ఆయన బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి భారీగా తరలివచ్చిన యువత ద్విచక్ర వాహనాలతో ర్యాలీని అనుసరించారు. చీమలమర్రి, కండ్లకుంట గ్రామాల్లో మహిళలు హారతి పట్టి, ఘనస్వాగతం పలికారు. కండ్లకుంటలో మాజీ సొసైటీ అధ్యక్షుడు కంఠమనేని కోటయ్య, ఉపసర్పంచ్ కంఠమనేని చందు ఏర్పాటు చేసిన అల్పాహార విందులో మంత్రి అంబటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 98శాతం హామీలు అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలుపించుకొని, రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. పారదర్శకంగా సంక్షేమం, అభివృద్ధి అందజేసి, మాట తప్పని ఏకైక ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మనసుల్లో నిలిచిపోయారన్నారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి పేదల పక్షాల ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని 175కు 175 అసెంబ్లీ స్థానాల్లో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గజ్జల నాగ భూషణ్‌రెడ్డి, సీనియర్ నాయకులు చిట్టా విజయభాస్కర్‌రెడ్డి, ఏపీడీసీ డైరెక్టర్ వీరారెడ్డి, వైస్ ఎంపీపీలు మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దూదేకుల హుస్సేన్‌బీ బాషా, యూత్ అధ్యక్షుడు గుత్తికొండ నన్నేసా, కావేటి రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

కూటమికి ఓటేస్తే రిజర్వేషన్ వద్దనుకున్నట్లే

మాదల(ముప్పాళ్ళ): రానున్న ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి ఓటేస్తే గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ముస్లిం మైనార్టీ వర్గాలకు అందించిన రిజర్వేషన్లు వద్దనుకున్నట్లేనని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. మండలంలోని మాదల గ్రామంలో శనివారం జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ముందుగా ముస్లిం మత పెద్దలతో సమావేశమయ్యారు. వైఎస్సార్ సీపీకి ముస్లింలు మూల స్తంభాలని, ముస్లిం సామాజిక వర్గానికి నాలుగు ఎమ్మెల్సీలు ఇచ్చిందని, ప్రస్తుత ఎన్నికల్లో ఏడు అసెంబ్లీ స్థానాలు కేటాయించినట్లు చెప్పారు. తెలుగుదేశం పార్టీ హయాంలో ముస్లింలు రాజకీయ నిరాదరణకు గురయ్యారని విమర్శించారు. నియోజకవర్గంలో ముస్లిం సామాజిక వర్గానికి చేసిన మేలును గురించి వారికి వివరించారు. సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ప్రత్యేక నమాజులో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎంజేఎం రామలింగారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు, రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, శిరిగిరి గోపాలరావు, మాదల ఉప సర్పంచ్ సైదా, కానాల పుల్లారెడ్డి, ఎంపీటీసీ గోగుల అంజిబాబు, దమ్మాలపాటి బుజ్జి, యూత్ అధ్యక్షుడు మాబుసుభాని, అయ్యప్ప, తాళ్ళ నాగేశ్వరరావు, చిమటా శ్రీనివాసరావు, దమ్మాలపాటి అమీన్‌షా, సైదా, బెల్లంకొండ మాబుసుబాని, యలవర్తిపాటి బాజీ, గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాదలలో భోజనం వడ్డిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

వైఎస్సార్ సీపీకి అఖండ మెజార్టీ ఖాయం



ఎన్నికల ప్రచారంలో వసంతకుమారి

పెదకూరపాడు: సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో, పెదకూరపాడులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆఖండ విజయం సాధిస్తుందని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వసంతకుమారి పేర్కొన్నారు. పెదకూరపాడులోని మిట్ట ప్రాంతంలో ఆమె శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతకుమారి మాట్లాడుతూ పెదకూరపాడు నియోజకవర్గంలో అభివృద్ధి చేసి చూపించామన్నారు. అందుకే ప్రతి ఇంటికి వెళ్లి ధైర్యంగా ఓటు అడుగుతున్నామన్నారు. వలంటీర్ వ్యవస్థపై చంద్రబాబు కక్ష కట్టి పింఛనుదారులను ఇబ్బందులు పెట్టారన్నారు. సంక్షేమ సారథులుగా ప్రతి ఇంటికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు చేరవేసే వలంటీర్లను చులకనగా చూడటం తగదన్నారు. అత్యధిక మెజార్టీతో నంబూరు శంకరరావు రెడవసారి గెలవబోతున్నారన్నారు. పెదకూరపాడు గ్రామంలో రూ.8 కోట్లతో సామాజిక ఆరోగ్య కేంద్రం సీసీ రోడ్లు, సచివాలయాల భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, డ్రెయిన్లు, పాటిబండ్ల, లగడపాడు, లింగగంంట్ల, చిన్నమక్కెన, రామాపురం, కన్నెగండ్ల రోడ్లు నిర్మించారన్నారు. ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. తంలో వసంతకుమారికి మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య , మండల పార్టీ అధ్యక్షుడు మస్తాన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి అవసరాలు తీర్చండి

సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బెల్లకొండ మీరయ్య

పెదకూరపాడు: మండలంలో 20 గ్రామ పంచాయతీల్లో తాగునీటి అవసరాలు తీర్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య కోరారు. శనివారం పెదకూరపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మీరయ్య అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీరు అవసరమైన ప్రాంతాలను గుర్తించి, మండల పరిషత్ నిధులతో బోర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నాగర్జున సాగర్ నుంచి తాగునీటి అవసరాలు నిమిత్తం వచ్చే నీటితో ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో పని చేసి, చెరువులను నింపాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీకి వేసవిలో పని కల్పించాలని కోరారు. గ్రామాల్లో పారిశుధ్య మెరుగునకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశానికి పలు శాఖలు అధికారులు గైర్హాజరయ్యారు. గైర్హాజరైన అధికారులకు నోటీసులు ఇచ్చి వివరణ కోరాలని తెలిపారు. పలు శాఖల పని తీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, వైఎస్ ఎంపీపీ షేక్ చాంద్ బాష, ఎంపీడీవో మల్లేశ్వరి, తహసీల్దారు ప్రభాకరరావు, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరుని సన్నిధిలో ఎమ్మెల్యే గోపిరెడ్డి



కాశీవిశ్వేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం ఎమ్మెల్యే గోపిరెడ్డితో..

నకరికల్లు: మండలంలోని నర్శింగపాడు గ్రామంలో వేంచేసి ఉన్న అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామిని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శనివారం దర్శించుకున్నారు. అనంతరం విశేష పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు కొమ్మవరపు పవన్‌కుమార్ శర్మ, ఫణికుమార్ శర్మ, వేదపండితులు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయ కమిటీ తరఫున మేడం రామచౌడారెడ్డి, వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మేడం రామకృష్ణారెడ్డి, బాలాజీ నగర్ తండా సర్పంచ్ మునిసింగ్ నాయక్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



నకరికల్లు: మండలంలోని చల్లగుండ్ల సున్నపుబట్టి వద్ద వేల్పుల భూషయ్య ఆయన కోడలు వేల్పుల రమణల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీఓ డి.జయమణి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని బస్ షెల్టర్ వద్ద ప్రతి ఏడాది వేసవిలో క్రమం తప్పకుండా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్న వేల్పుల కోటేశ్వరరావును అభినందించారు. గ్రామ కార్యదర్శి కొమ్మవరపు అప్పారావు, ఎంపీటీసీ సభ్యులు జక్కిరెడ్డి కోటిరెడ్డి, గోపు అంజిరెడ్డి, వేల్పుల మనోజ్‌కుమార్, పాలపాటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

52 మంది వలంటీర్లు రాజీనామా



కమిషనర్ షమ్మికి రాజీనామా పత్రాలు అందజేస్తున్న 4, 28 వార్డుల వలంటీర్లు



ఎంపీడీవో జగదీష్‌కు రాజీనామా పత్రాలు అందిస్తున్న కొమెరపూడి వలంటీర్లు

సత్తెనపల్లి: రాజకీయాలకు అతీతంగా పనిచేస్తున్న వలంటీర్లపై ప్రతిపక్షాలు చేస్తున్న అడ్డగోలు విమర్శలకు మానసికంగా ఇబ్బంది పడి మూకుమ్మడి రాజీనామాలు చేస్తున్నామని పలువురు వలంటీర్లు పేర్కొన్నారు. పట్టణంలోని 1, 4, 28 వార్డులకు చెందిన 28 మంది వలంటీర్లు శనివారం స్వచ్ఛందంగా తమ రాజీనామా పత్రాలను మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మికి అందించారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ ప్రజా క్షేత్రంలో క్రియాశీలకంగా పని చేసి మరోసారి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటామన్నారు. 2019లో సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ సంక్షేమ పాలనకు ప్రతిగా నిలిచిందన్నారు. అవ్వాతాతలకు వలంటీర్ల వల్ల ఎంతో మేలు జరిగిందన్నారు. .

కొమెరపూడిలో 24 మంది..

కొమెరపూడి గ్రామానికి చెందిన 24 మంది వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. సత్తెనపల్లి ఎంపీడీవో జగదీష్‌ను కలిసి రాజీనామా పత్రాలను అందించారు. ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని, సత్తెనపల్లి శాసన సభ్యుడిగా అంబటి రాంబాబును, నరసరావుపేట ఎంపీగా డాక్టర్ పి.అనిల్ కుమార్ యాదవ్‌ను గెలిపించుకుంటామని స్పష్టం చేశారు.

జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి

బయ్యవరం(క్రోసూరు): క్రోసూరు మండలం బయ్యవరం గ్రామంలో బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు నంబూరు కల్యాణ్ చక్రవర్తి జగ్జీవన్ రామ్ విగ్రహానికి శుక్రవారం రాత్రి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేక్ కట్ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

విశ్రాంత హెచ్ఎంకు అవార్డు



సత్తెనపల్లి: విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు, రచయిత్రి డాక్టర్ సరికొండ రమాదేవికి అభినందన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉత్తమ మహిళా ఉగాది అవార్డ్స్‌లో భాగంగా తెలుగు మహిళా అవార్డును శుక్రవారం హైదరాబాద్‌లో ప్రదానం చేశారు. విబ్రాంత్ వాయిసెస్ డిజిటల్ స్టూడియో అధ్యక్షుడు నాదమునుల రామరావు, కోశాధికారి ఆర్.స్నేహరెడ్డి, ప్రముఖ గాయకుడు వెంపటి మూర్తి శ్రీరాములు, గాయకులు ఆర్.కె.ఫణి, కాళహస్తి రాజ్యలక్ష్మి, మిస్ ఉదయం సోషల్ వర్కర్ అభినందన చేతుల మీదుగా రమాదేవికి ఆవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. శాలువాతో ఘనంగా సన్మానించారు. రమాదేవిని శనివారం పట్టణంలోని పలువురు సాహితీవేత్తలు, కళాకారులు అభినందించారు.

నర్సింగ్ వృత్తి పవిత్రం



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ రాధ

సత్తెనపల్లి: నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైనదని ఏరియా వైద్యశాల నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ అన్నారు. పట్టణంలోని వేద నర్సింగ్ స్కూల్ విద్యార్థినులకు శనివారం నర్సింగ్ క్యాప్ బహూకరించారు. ఈ సందర్భంగా నర్సింగ్ విద్యార్థినులతో ప్రభుత్వ వైద్యశాల హెడ్ నర్స్ వెంకటేశ్వరమ్మ వృత్తి ప్రమాణం చేయించారు. అనంతరం జరిగిన సభకు నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపల్ మామిడి మాలతి అధ్యక్షత వహించారు. రాధ మాట్లాడుతూ నర్సింగ్ కోర్సు పూర్తి చేసిన వారికి దేశ, విదేశాల్లో మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. పేదలకు సేవ చేసేందుకు ఈ వృత్తి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. సత్తెనపల్లి ప్రాంతంలో నర్సింగ్ విద్యను ప్రవేశ పెట్టిన వేద విద్యా సంస్థల యజమాన్యాన్ని అభినందించారు. చదువు కన్నా క్రమశిక్షణ ఎంతో అవసరమన్నారు. అనంతరం తల్లితండ్రుల సమక్షంలో విద్యార్థులకు క్యాప్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డైరెక్టర్ చింతాడ ప్రభావతి, అకాడమిక్ డైరెక్టర్ సూర్య ప్రకాష్, అధ్యాపకులు అనూష, సింధూష, పవిత్ర, ప్రియ, జ్యోతి, విజయ శాంతి, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

కార్యకర్తల జోలికొస్తే చూస్తూ ఊరుకోం



షరీఫ్‌ను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అమరావతి: స్థానిక ముస్లిం కాలనీకి చెందిన వలంటీర్ భర్త సయ్యద్ నాగుల్ షరీఫ్‌పై శనివారం అదే కాలనీకి చెందిన ఎస్కే ఉమ్మర్‌వలి దాడి చేయడంతో గాయపడ్డాడు. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న సయ్యద్ నాగుల్ షరీఫ్‌ను వైఎస్సార్‌సీపీ నాయకుడు నంబూరు కల్యాణ చక్రవర్తి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమరావతి సచివాలయం-2లో వలంటీర్‌గా పనిచేస్తున్న తన భార్య మొబైల్‌కు మేసేజ్ ఎందుకు పెట్టావని అడిగిన వైఎస్సార్ సీపీ కార్యకర్త షరీఫ్‌పై పదిమందితో వచ్చి దాడిచేయడం దుర్మార్గమన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీ కార్యకర్తల జోలికివస్తే సహించేది లేదన్నారు. న్యాయపరంగా బుద్ధి చెబుతామన్నారు. జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు షేక్ హష్మీ, వీర రాఘవయ్య, నంబూరు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



రెంటచింతల: మండల కేంద్రం రెంటచింతలలోని మాచర్ల- గుంటూరు ప్రధాన రహదారిపై ఎన్నికల ప్రవర్తన నియమావళి పర్యవేక్షణ(ఫ్లయింగ్ స్క్వాడ్) అధికారి కె.పాపయ్య నేతృత్వంలోని బృందం శనివారం ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టింది. పాపయ్య మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు మండలంలోని ఈ తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. వాహనాల్లో పరిమితికి మంచి నగదు, మద్యం, బంగారం, వెండి వస్తువులు తీసుకెళ్ల రాదని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని గోళ్ళపాడు సమీపంలోని సేఫ్ ఫార్మా కంపెనీ వద్ద శనివారం జరిగింది. ఘటనకు సంబంధించి, పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. మండలంలోని తురకపాలెం ఎస్సీ కాలనీకి చెందిన వై.బాలస్వామి(50) సైకిల్‌పై వెళ్తుండగా.. వెనుకగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన బాలస్వామిని చికిత్స నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలి

- గ్రామీణ ప్రాంతాల్లో వడదెబ్బ నివారణపై అవగాహన
- పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రమాదేవి



బొల్లవరంలో ఓఆర్ఎస్ ద్రావణం అందిస్తున్న వైద్య సిబ్బంది

ముప్పాళ్ళ: పెరుగుతున్న ఎంత తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రమాదేవి సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వడదెబ్బ లక్షణాలు, నివారణ చర్యలపై వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రమాదేవి శనివారం స్పందించారు. ఉదయం 10 గంటల నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉంటోందన్నారు. శరీరంలో నీటి శాతం కోల్పోవడంతో కళ్లు తిరగడంతో పాటుగా కండరాలు పట్టుకోవడం, తల తిరగడం, చెమటలు పట్టడం లాంటి పలు లక్షణాలు కనిపిస్తే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. బయటకు వెళ్లేప్పుడు తప్పనిసరిగా ఓఆర్ఎస్ ద్రావణాన్ని కలిపిన నీటిని వెంట తీసుకెళ్లాలని చెప్పారు. సన్ గ్లాసెస్.. తలకు టోపీ ధరించాలన్నారు. ఆహారంలో ఎక్కువగా ద్రవ పదార్థం ఉండేలా చూసుకోవాలన్నారు. పలుచని నూలు దుస్తులు ధరిస్తే బాగుంటుందన్నారు. రోజుకు కనీసం 15 గ్లాసులు నీరు తాగాలని సూచించారు. మజ్జిగ, కొబ్బరి నీళ్లు సేవిస్తే మంచిదని చెప్పారు. అన్ని గ్రామాల్లో వడదెబ్బ లక్షణాలపై వైద్య సిబ్బందితో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నామన్నారు.

సీఎం వైఎస్ జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి

వైఎస్సార్ సీపీ నాయకురాలు అంబటి విజయలక్ష్మి



ఒకటవ వార్డులో ప్రచారం చేస్తున్న అంబటి విజయలక్ష్మి

సత్తెనపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సతీమణి, వైఎస్సార్ సీపీ నాయకురాలు అంబటి విజయలక్ష్మి అన్నారు. పట్టణంలోని 1వ వార్డులో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా అంబటి విజయ లక్ష్మి మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి ఇంటి ముందుకే ప్రభుత్వ సేవలను తీసుకొచ్చారన్నారు. గతంలో ఏ ప్రభుత్వమైనా ఈ స్థాయిలో ప్రజల గురించి ఆలోచించిందా? అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతా హాసంతి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ఓటమి తప్పదన్నారు. రానున్న ఎన్నికల్లో సత్తెనపల్లి శాసనసభ్యుడిగా అంబటి రాంబాబును, నరసరావుపేట ఎంపీగా డాక్టర్ పి.అనిల్ కుమార్ యాదవ్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తద్వారా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌ను చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి రాంబాబు కుమార్తె అంబటి మనోజ్ఞ, మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి, ఒకటవ వార్డు కౌన్సిలర్ వరికల్లు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జిరాక్స్ మిషన్, కుర్చీలు బహూకరణ



జెడ్పీ ఉన్నత పాఠశాలకు జిరాక్స్ మిషన్ బహూకరణ

నకరికల్లు: చేజర్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత, ఎంపీపీ పాఠశాలలకు, డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్‌కు మల్టీ పర్పస్ కలర్ జిరాక్స్ మిషన్‌లు, కుర్చీలను మిడ్ వెస్ట్ గ్రానైట్ ప్రైవేటు లిమిటెట్ సంస్థ తరపున శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, రవి, మస్తాన్, రవీందర్ మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఫండ్స్ ద్వారా ఆయా పరికరాలు అందజేసినట్లు తెలిపారు. మిడ్ వెస్ట్ గ్రానైట్ సంస్థ యాజమాన్యానికి, ప్రతినిధులకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు. సర్పంచ్ బొడ్లపాటి కృష్ణకుమారి భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

పిడుగురాళ్లరూరల్: బాల్య వివాహాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీడీపీవో ఎ. శ్రీవల్లి అన్నారు. పట్టణంలోని జానపాడు గ్రామంలోని హైస్కూల్‌లో బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించాలన్నారు. సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.